ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
ఆదివారం 10 మార్చి 2024

శనివారం ఉష్ణోగ్రతలు | గరిష్టం : 37.0°C | కనిష్టం : 23.0°C



ఈసారైనా.. 'గూడు' కుదిరేనా?

పదేళ్లుగా పేదోడికి సాకారం కాని సొంతింటి కల



- గత ప్రభుత్వంలో అందని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు
- ఇందిరమ్మ ఇళ్ల పథకంతో కాంగ్రెస్ సర్కారు చేయూత
- సొంత స్థలముంటే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల సాయం
- విడతలవారీగా లబ్ధిదారుల ఖాతాలో జమచేయనున్న ప్రభుత్వం
- రేపు పథకాన్ని ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- తొలివిడతలో ఉమ్మడి జిల్లాకు రానున్న 50వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు

వరంగల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పేదోడి సొంతింటి కల కలగానే మిగిలింది. ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటిని నిర్మించి ఇస్తామని చెప్పిన పాలకుల మాటలు నీటి మూటలే అయ్యాయి. గత ప్రభుత్వం అర్హులందరికీ విడతల వారిగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో అమలు నోచుకోలేదు. గత ఏడాది గృహలక్ష్మి పేరుతో దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ఎన్నికల కోడ్‌తో ఆ పథకం ముందుకు సాగలేదు. దీంతో పదేళ్లుగా సొంత ఇళ్లు కలగా మారింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం జాగా ఉంటే రూ.5లక్షల సాయంతో సొంతింటి నిర్మించి ఇచ్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించనుంది. దీంతో పేదోడికి సొంతింటిపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు

2014లో బీఆర్ఎస్ పార్టీ సింగల్ బెడ్‌రూమ్‌తో పేదలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎన్నికలకు ముందు ప్రకటించింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది ప్రతీ నియోజకవర్గానికి 500 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించింది. 2016-19 వరకు మూడేళ్లలో మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లాకు 32వేల డబుల్ ఇళ్లు మంజూరయ్యాయి. అప్పటి మంత్రి చందులాల్, స్పీకర్ మధుసూదనాచారితో పాటు కొంత మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు అదనంగా డబుల్ ఇళ్లను మంజూరు చేయించుకున్నారు. అయితే డబుల్ ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగాయి. వరంగల్ అర్బన్ జిల్లాలో చేపట్టిన 4,784 ఇళ్లలో సగం కూడా పూర్తి కాలేదు. కొన్నిచోట్ల డబుల్ ఇళ్లు నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా తాత్సారం చేశారు. భూపాలపల్లి జిల్లాలో 3,882 ఇళ్లు మంజూరు అయితే 1,500 నిర్మాణాలు పూర్తి అయ్యాయి. భాస్కర్‌గడ్డలో ఉన్న 9,940 ఇళ్లు పంపిణీ చేసినప్పటికీ ఆ ఇళ్లలో కనీస వసతులు లేక నిరుపయోగంగా మారుతున్నా యి. మహబూబాబాద్ జిల్లాలో 5,571 ఇళ్లు మంజూరి కాగా, 1,733 ఇళ్లు మాత్రమే పూర్తి అయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డబుల్ ఇళ్లు ట్రబుల్‌గా మారటంతో సొంతింటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో గత ప్రభుత్వం 2020-21లో సొంత జాగా ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సాయం చేస్తా మని ప్రకటించింది. అయితే ఆ పథకం అమలుకు నోచుకోలేదు. 2023-24లో గృహలక్ష్మి పేరుతో సొంత జాగాలో ఇళ్లు నిర్మించుకుంటే రూ.3లక్షల ఆర్థిక సాయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు దరఖాస్తులు కూడా స్వీకరించింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 2,58,090 మంది దరఖాస్తులు రాగా, అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిన చేసింది. ఇందులో 1,91,240 మంది అర్హులుగా గుర్తించింది. అయితే తొలి విడతలో నియోజకవర్గానికి 3వేల ఇళ్లే ప్రభుత్వం కేటా యించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 30వేల గృహ లక్ష్మీ ఇళ్లు మంజూరయ్యాయి. ములుగు, హనుమ కొండ, మహబూబాబాద్, జనగామ జిల్లాలో కొన్నిచోట్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు కూడా అందించారు. అయితే ఎన్నికల కోడ్ రావటంతో గృహలక్ష్మికి బ్రేక్ పడింది. అటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందక, ఇటు గృహలక్ష్మి పథకం ద్వారా సొం తింటి కల ఆవిరి కావటంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పదేళ్లలో 5వేల మందికి కూడా పూర్తిస్థాయిలో సొంత ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చేయూతనివ్వలేదనే విమర్శలు ఉన్నాయి. పదేళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూపులే మిగిలాయి తప్ప... కల సాకారం కాలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకంతో..

పదేళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూసిన అర్హులైన పేదలకు కొత్త ప్రభుత్వం గూడుపై గుడ్‌న్యూస్ చెప్పింది. తొలి దశలో సొంతంగా జాగా ఉంటే ఇంటిని నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం చేస్తా మని ప్రభుత్వం ప్రకటించింది. ఆ తరువాత సొం తంగా ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇందిరమ్మ కాలనీ లను ఏర్పాటు చేయనుంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరుగ్యారంటీలను ప్రకటించింది. అందులో ఇందిరమ్మ

మిగతా 7వ పేజీలో..



వైఎస్ హయాంలో..

సొంతిల్లు పేదోళ్ల కల. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంతో సొంతింటిని నిర్మించుకోవాలని ఎంతోమంది పేదలు ఎదురుచూస్తున్నారు. 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపె ట్టింది. చాలా గ్రామాల్లో ఇందిరమ్మ కాలనీలను ఏర్పా టు చేసి, సొంతింటిని నిర్మించి ఇచ్చింది. జాగా ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.1లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు ఆయా సామజికవర్గాలను బట్టి ఆర్థికసాయం అందించింది.

ఉమ్మడి జిల్లాకు 50వేలకు పైగా ఇళ్లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొలి విడతలో 50వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులకు అందనున్నాయి. ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గానికి తొలివిడతలో 3,500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్లుగా ప్రకటించింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు 42వేల ఇందిరమ్మ ఇల్లు మంజూరు కానున్నాయి. అలాగే భూపాలపల్లి జిల్లాలో మంథని నియోజకవర్గంలోని సగానికి పైగా మండలాలు ఉన్నాయి. అలాగే ములుగు జిల్లాలో భద్రాచలం నియోజకవర్గంలోని రెండు మండలాలు, మహబూబాబాద్ జిల్లాలో ఇల్లందు నియోజకవర్గంలోని రెండు మండలాలు, హనుమకొండ జిల్లాలో హుస్నాబాద్ నియోజకవర్గంలోని రెండు మండలాలు, హుజురాబాద్ నియోజకవర్గంలో ఒక మండలం కలిసి ఉంది. ఈ మండలాల్లో కూడా సుమారు 8వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు రానున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక్కొక్క ఇంటికి రూ.5లక్షల చొప్పున మొత్తం 50వేల ఇందిరమ్మ ఇళ్లకు రూ.25వేల కోట్లు ఖర్చు చేయనున్నారు.



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈగ మల్లేశం

సమాజాన్ని చైతన్యపర్చేది నాటక రంగమే..

- కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం
- వర్ధన్నపేటలో ముగిసిన నాటక పోటీలు..

వర్ధన్నపేట, మార్చి 9: సమాజాన్ని చైతన్యపర్చడంలో.. సామాజిక స్పృహ, సమస్యలను ఎత్తిచూపడంలో నాటక రంగానిది కీలకపాత్రని కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో భారతీయ నాటక కళా సమితి 50వ స్వర్ణోత్సవ వేడుకలు, స్వర్ణోత్సవ ప్రత్యేక సంచిక కళాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉభయ రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు శుక్రవారం రాత్రి ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బలగం సినిమా నటుడు కేతిరి సుధాకర్‌రెడ్డి, టీవీ, సినిమా కళాకారులు లోహిత్ కుమార్, ఈగ మల్లేశం హాజరై నటరాజ స్వామికి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈగ మల్లేశం మాట్లాడుతూ.. నాటి చరిత్ర తెలుసుకోగలిగితేనే యువత పెడదారిన కాకుండా సన్మార్గంలో నడిచే అవకాశం దక్కుతుందని, ఉమ్మడి కుటుంబంతోనే కుటుంబ విలువలు తెలుస్తాయని అన్నారు. నిలకడ లేని స్థితిలో కొందరు యువకులు లక్ష్యం చేరుకోలేక, రోడ్డునపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాటక సమితి స్వర్ణోత్సవాల సందర్భంగా ప్రత్యేక సంచికను విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో భారతీయ నాటక కళాసమితి పూర్వ అధ్యక్షుడు వనం లక్ష్మీకాంతారావు, డాక్టర్ కళాధర్, కిశోర్, సినీ దర్శకుడు శ్రీనివాస్, చీటూరి అశోక్, సంగీత కళాకారుడు మోటపోతుల నవీన్, బోయినపల్లి పురుషోత్తంరావు, ప్రస్తుత భారతీయ నాటక కళా సమితి కార్యవర్గం గాడిపల్లి రాజేశ్వర్, మాశెట్టి సోమయ్య, ఈగ సాంబయ్య, ఎమ్డీ అప్సర్, పెద్దూరి సంజీవరావు, సిలువేరు కుమారస్వామి, సమ్మెట శ్రీనివాస్, తుమ్మల యాకయ్య, గోళవాల సూర్యనారాయణ, వడ్లకొండ రాజు, మోడెం కుమారస్వామి, ఎంపీ భాస్కరాచారి, అన్నమనేని కమలాకర్‌రావు, గుజ్జ సోమేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

ఉభయ రాష్ట్రాల నాటిక పోటీల బహుమతి ప్రదానోత్సవం శుక్రవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. ఉత్తమ ప్రథమ ప్రదర్శనగా శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి కౌసల్యా సుప్రజా రామ, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా గోవాడ క్రియేషన్స్

మిగతా 8వ పేజీలో..

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా హుస్సేన్‌నాయక్



మహబూబాబాద్ రూరల్, మార్చి 9 : జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల తావుర్యాతండాకు చెందిన బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జాటోతు హుస్సేన్‌నాయక్ నియామకమయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ అడిషనల్ సెక్రటరీ ఆర్.జయ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మచ్చర్ల తావుర్యాతండాకు చెందిన జాటోతు హుస్సేన్‌నాయక్ బీజేపీ ద్వారా రాజకీయాల్లోకి అరంగేట్రం చేశారు. 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో మానుకోట నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా, 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఇటీవల 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం మానుకోట నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో కేంద్రం ఆయనను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమించారు. కాగా, మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చెర్లలో లచ్చ్యాగంషీ దంపతులకు 1982 మార్చి 6న హుస్సేన్‌నాయక్ జన్మించారు. ఆయనకు భార్య జమున, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బీఏ (పొలిటికల్ సైన్స్) చేశారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బిషప్

రేపటి నుంచి ఫాతిమా మాత ఉత్సవాలు

- వరంగల్ బిషప్ ఉడుముల బాల

కాజీపేట, మార్చి 9: ఈ నెల 11 నుంచి 13 వర కు కాజీపేట ఫాతిమా చర్చి ఆవరణలో ఫాతిమా మాత ఉత్సవాలు జరుగనున్నాయని వరంగల్ పీఠాధిపతి ఉడుముల బాల వెల్లడించారు. కాజీపేట మీడి యా పాయింట్‌లో శనివారం జరిగిన మీడియా స మావేశంలో ఉడుముల బాల ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరించి వివరాలు తెలిపారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హైదరాబాద్ అగ్రపీఠాధిపతి కార్డినల్ పూల అంథోని హాజరుకానున్నారని అన్నారు. 11న సోమవారం ఫాదర్ సింగారెడ్డి ఇన్నారెడ్డి దివ్యబలి పూజ, అనంతరం ఫాదర్ జయప్రతాప్ రెడ్డి గురువులతో 'కుటుంబాల మాత' అనే అంశంపై ప్రత్యేక ప్రార్థనలతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. అనంతరం మహిళలకు సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 12వ తేదీ మంగళవారం ఉదయం 4.30 నిమిషాలకు బిషప్ ఉడుములబాల దివ్య బలిపూజ, సాయంత్రం 5:30 నిమిషాలకు పురవీధులతో ఫాతిమామాత స్వరూపంతో మహారథ ప్రదక్షణ, 7:30గంటలకు కొవ్వొత్తులతో ప్రసాద ఆశీర్వాదం ఉం టాయని తెలిపారు. చివరి రోజు 13వ తేదీ బుధవారం ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో విచారణ గురువు అను కిరణ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు బొక్క దయాసాగర్, ఫాదర్‌లు జెరోమ్, పి.బాలథాస్, ఎస్.సురేందర్, కరుణాకర్, రాజ్‌మోహన్, మథ్యాస్‌రెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.

జిల్లాను ప్రగతిపథంలో నడిపిస్తాం..

- మంత్రి పొంగులేటితో కలిసి నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- ఇప్పటికే రూ.200 కోట్లతో టెక్నికల్ సెంటర్ మంజూరు
- అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



మాట్లాడుతున్న మంత్రి సురేఖ

వరంగల్ సిటీ, మార్చి 9: జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయంగా, జిల్లాను ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శనివారం కొండా సురేఖ ఆమె నివాసంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలన వంద రోజుల కూడా కాకుండానే జిల్లా అభివృద్ధికి నిధులు తీసురావడం జరిగిందన్నారు. ఇప్పటికే రూ.200కోట్లతో ఖిలావరంగల్ మండలం రంగశాయిపేటలో టెక్నికల్ సెంటర్ మంజూరు చేయించామన్నారు. తెలంగాణాలోనే ఏకైక డి అడిక్షన్ సెంటర్ ఎంజీఎంలో నెలకొల్పడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో ముందున్నామని తెలిపారు. ఆదివారం రూ.280.85కోట్లతో అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం రూ.280.85కోట్లతో అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి చేయనున్నట్లు తెలిపారు.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు..

- రూ.2 కోట్లతో కాజీపేట క్యూసీ ఆఫీస్ (జీడబ్ల్యూఎంసీ)వడ్డెపల్లి, వెంకట్రామ, నాయుడు పెట్రోల్ పంపు, టీటీడీ జంక్షన్ల అభివృద్ధి, సుందరీకరణ అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రూ.2 కోట్లతో బాలసముద్రం చిల్డ్రన్స్ పార్కు అభివృద్ధి
- రూ.15లక్షలతో ఎంజీఎంలో పీడియాట్రిక్ బ్లాక్‌లో పిల్లలకు ఆట పరికరాల ఏర్పాటు
- రూ. 2 కోట్లతో ఎస్ఎస్ఎం క్లబ్, సీకేఎం డివైడర్, బాలాజీనగర్ జంక్షన్ అభివృద్ధి, సుందరీకరణ.
- రూ. 3.50 కోట్లతో గోవిందరాజుల గుట్ట వద్ద ఎలివేటెడ్ లేవల్ సర్ఫేస్ రిజర్వాయర్ (ఈఎల్ఎస్ఆర్) నిర్మాణం.
- రూ.250 కోట్లతో జీడబ్ల్యూఎంసీ పరిధిలో వరదనీటి నివారణకు సమగ్ర రక్షణ చర్యలు.
- రూ.50 లక్షలతో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో శివనగర్‌లో మెట్ల బావి పరిరక్షణ
- రూ.10 కోట్లతో 2023-24 స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డిఎఫ్)నిధుల కింద తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు, అవెన్యూ ప్లాంటేషన్.
- రూ. 3.65 కోట్లతో నర్సంపేట, ఖమ్మం రోడ్డులో భారీ ముఖద్వార నిర్మాణ పనులకు ప్రారంభోత్సవం.
- రూ.2.95 కోట్లతో కరీంనగర్, ములుగురోడ్డులో భారీ ముఖ ద్వారం నిర్మాణం.
- రూ.3.90 కోట్లతో పుప్పాలగుట్టలో 1500 కిలోలీటర్ల ఎలివేటెడ్ లేవల్ సర్ఫేస్ రిజర్వాయర్ నిర్మాణం
- రూ.20 లక్షలతో ఫాతిమానగర్ జంక్షన్ అభివృద్ధికి శంకుస్థాప చేయనున్నారు.
- ఇవే కాకుండా రూ.158 కోట్లతో భద్రకాళి చెరువు పరిధిలో వరదనీటి నివారణ చర్యలు(బొందిగడ్డ)కు ఉద్దేశించిన పనులకు సంబంధించిన ఫైల్ తుది అనుమతుల కోసం ముఖ్యమంత్రి వద్ద ఉందని మంత్రి తెలిపారు. అనుమతి రాగానే పనులు ప్రాంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మొత్తంగా రూ.438 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులతో వరంగల్ జిల్లా రూపురేఖలు మారుతాయని సురేఖ వెల్లడించారు.

నేడు మంత్రి పొంగులేటి రాక



హనుమకొండ సిటీ, మార్చి 9: జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీని వాస్‌రెడ్డి ఆదివారం వరం గల్‌కు రానున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. కాకతీయ యూ నివర్సిటీతోపాటు వరంగల్ ఉర్సు, కాజీపేట, హనుమకొండ తదితర ప్రాంతాల్లో పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు మంత్రులు, కొండాసురేఖ, సీతక్కతో పాటు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు తదితరులు పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. మరో వైపు జిల్లా అధికార యంత్రాంగం కూడా సన్నద్ధమైంది. ఈ నెల 13న లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న క్రమంలో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ద్వారా శంకుస్థాపన చేయించి తద్వారా ఆటంకలు కలగకుండా ఉండేలా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.

హస్తం గూటికి మార్నేని

- కాంగ్రెస్ కండువా కప్పుకున్న డీసీసీబీ చైర్మన్ దంపతులు
- వారితోపాటు బీఆర్ఎస్ నాయకుల చేరిక



గాంధీభవన్‌లో మార్నేని, బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ కండువ కప్పుతు ఆహ్వానిస్తున్న దీపాదాస్ మున్షి, ఎమ్మెల్యే నాగరాజులు

ఐనవోలు, మార్చి 9: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఆయన సతీమణి, ఐనవోలు ఎంపీపీ మార్నేని మధుమతి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సచివాలయంలో కలుసుకొని పుష్పగు చ్ఛం అందజేయగా, ఆయన వారికి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు ప్రభుత్వ సలహాదారుడైన వేం నరేందర్‌రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి పార్టీలో చేరికపై చర్చించారు. గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దిపదాస్ మున్షీ వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మార్నేని దంపతులతోపాటు నందనం సొసైటీ డైరెక్టర్లు, దేవస్థానం మాజీ చైర్మన్ సంపత్ కుమార్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుర్ర రాజశేఖర్, ఎంపీటీసీ టి.రమేష్, తాజా మాజీ సర్పంచ్‌లు, గ్రామాల అధ్యక్షులు, మాజీ ఉపసర్పంచ్‌లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, దేవస్థానం మాజీ డైరెక్టర్లు, నాయకులు సుమారు 200 మంది కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

కాగా, కొద్ది రోజులుగా మార్నేని దంపతులు పార్టీ వీడనున్నారనే సమాచారంతో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే కడియం శ్రీహరిలు మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌తో కలిసి మార్నేనికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. పలు దఫాలు చర్చించారు. అయినా మార్నేని ఎవరికీ చెప్పపెట్టకుండా హైదరాబాద్‌కు వెళ్లి కాంగ్రెస్ పార్టీ పెద్దలతో మాట్లాడి పార్టీలో చేరి అనుచరులకు సమాచారం ఇవ్వడంతో కంగుతిన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ వలసలు మొదలుకావడంతో రవీందర్‌రావు అనుకూల, వ్యతిరేకవర్గాల్లో రకరకాల చర్చలు కొనసాగుతున్నాయి. నాయకులు పార్టీ వీడటం వెనుక ఆంతర్యమేమిటని, ప్రస్తుతం పదవుల్లో ఉన్న వీరు వీరి ఆకాంక్ష ఏమిటని, ప్రధానంగా రాజకీయ భవిష్యత్తు కోసమే పార్టీ వీడారనే చర్చ జరుగుతోంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్, మార్చి 9: రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలం అయోధ్య గ్రామ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామ శివారు ముత్యాలమ్మ తండాకు చెందిన కేలోతు కిషన్ (38) నాటు కోళ్ల విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తాళ్లపూసపల్లి నుంచి మహబూబాబాద్‌కు సొంత పనినిమిత్తం తన ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో అయోధ్య గ్రామ శివారులో రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో కిషన్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

అవకాశం కల్పించండి

హనుమకొండ చౌరస్తా, మార్చి 9: బీఆర్ఎస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సిరిమల్లె సదానందం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని శనివారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ.. 22 ఏళ్లుగా బీఆర్ఎస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా, ఉద్యమకారుడిగా సేవలు చేశానన్నారు.

ఉద్యమకారులకే బీఆర్ఎస్ ఎంపీ టికెట్ ఇవ్వాలి..

- అరూరి రమేశ్, కడియం కావ్యకు ఇవ్వొద్దు
- ఉద్యమకారుల డిమాండ్.. పసునూరి ఆధ్వర్యంలో రహస్య భేటీ



భేటీలో పసునూరితో ఉద్యమకారులు

వరంగల్ క్రైం, మార్చి 9: రెండు సార్లు ఎమ్మెల్యేగా చేసి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమిపాలైన అరూరి రమేశ్‌కు, పార్టీ ప్రాథమిక సభ్యత్వం కూడా లేని కడియం కావ్యకు వరంగల్ ఎంపీ టికెట్ ఇవ్వొద్దని బీఆర్ఎస్ అధిష్ఠానాన్ని ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించి పార్టీ కోసం పనిచేస్తున్న తమలో ఒకరికి అవకాశం కల్పించాలని వారు స్పష్టం చేస్తున్నట్లు తెలిసింది. శనివారం రాత్రి హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఒక కన్వెన్షన్‌లో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ ఆధ్వర్యంలో ఉద్యమకారులు జోరిక రమేశ్, వీరేందర్, బోడ డిన్నా, చింతల యాదగిరి, బండి రజనీకుమార్, ఎం.శ్రీనివాస్, సదానందం రహస్య భేటీ నిర్వహించారు.

వరంగల్ ఎంపీ టికెట్ ఇచ్చే విషయంలో పార్టీ అధిష్ఠానం ప్రస్తుతం ఎంపీగా కొనసాగుతున్న తనను పరిగణలోకి తీసుకోకపోవడంపట్ల పసునూరి దయాకర్ అసహనంతో ఉన్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఉద్యమకారులతో పసునూరి దయాకర్ భేటీ నిర్వహించినట్లు సమాచారం. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్‌లో ఉన్నవారిలో ఉద్యమ సమయం నుంచి కొనసాగిన ఏకైక వ్యక్తినని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. తనను పార్టీ ఏమాత్రం పరిగణలోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. నిన్నమొన్న వచ్చిన వారికి పార్టీ పెద్దపీట వేస్తోందని పేర్కొనట్లు సమాచారం. భేటీ అయిన వారిలో ఎవరికి ఇచ్చినా తాను సహకరిస్తానని, వారి గెలుపునకు తనవంతు సహకారం అందిస్తానని పసునూరి తెలిపినట్లు తెలిసింది. ఒక వేళ తనకు అవకాశం వచ్చినట్లైతే ఉద్యమకారులకు పార్టీలో సముచిత స్థానం దక్కేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

రహస్య భేటీకి హాజరైన ఉద్యమకారులు తమలో ఎవరికి అవకాశం కల్పించినా ఐక్యంగా ఉండి గెలిపించుకుంటామని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. తమ నిర్ణయాన్ని పార్టీ పరిగణలోకి తీసుకోనట్లైతే ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుందామని, ఉద్యమకారులకు గౌరవం ఇచ్చే సంస్థలోకి వెళదామని పలువురు ఉద్యమకారులు వారి అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు తెలిపినట్లు సమాచారం. కాగా, ఒకరిద్దరు ఉద్యమకారులు మాట్లాడుతూ.. రెండుసార్లు ఎంపీగా చేసిన పసునూరి దయాకర్‌ను సైతం టికెట్ రేసు నుంచి తప్పుకోవాలని కోరినట్లు తెలిసింది. ఈ భేటీ బీఆర్ఎస్‌లో ప్రకంపనలు సృష్టించే అవకాశం ఉంది.

నేడు ఉచిత శిక్షణకు ప్రవేశ పరీక్ష

వడ్డెపల్లి, మార్చి 9: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ ద్వారా 5 నెలల పాటు వివిధ ఉద్యోగాల కోసం నిర్వహించే పోటీ పరీక్షలకు హనుమకొండ వడ్డెపల్లి లోని షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సంస్థ అధికారి బి.నిర్మల, స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ గౌరవ సంచాలకుడు డాక్టర్ కొంగర జగన్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్‌పై ఫొటో సరిగా ముద్రితం కాకుంటే ఫొటో అతికించి గెజిటెడ్ అధికారితో సంతకం చేయించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్ష సమయంలో బ్లాక్‌పెన్ మాత్రమే వాడాలని, పరీక్ష కేంద్రానికి హాల్ టికెట్, ఆధార్‌కార్డు తీసుకొని గంట ముందుగానే హాజరు కావాలని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ : 95428 34507 లో సంప్రదించాలని కోరారు.

ఉచిత ఫిట్‌నెస్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 9: ఆర్మీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించిన ఉచిత ఫిట్‌నెస్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కేవీఆర్ ఫిట్‌నెస్ సెంటర్ ట్రైనర్ కీసరి రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు 9133224565 ఫోన్ నెంబర్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. శిక్షణ తరగతులు ఈ నెల 13 నుంచి వరంగల్ ఓసిటీ గ్రౌండ్‌లో ప్రారంభం అవుతాయని తెలిపారు.

13న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 9: ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 13న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా యాక్సిస్ బ్యాంకులో ఖాళీగా ఉన్న బిజినెస్ డెవలప్‌మెంట్ ఎక్జిక్యూటివ్స్‌గా ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 18 నుంచి 28 యేళ్ల వయస్సు కలిగి ఏదేని డిగ్రీ పూర్తి చేసిన యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉండి అర్హులైన వారు ఈ నెల 13న నిర్వహించే జాబ్ మేళాకు ఉదయం 11గంటలలోపు ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 9848895937 ఫోన్ నెంబర్లు సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

17న జిల్లా స్థాయి చెస్ పోటీలు


వరంగల్ స్పోర్ట్స్, మార్చి 9: తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 17న హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15 బాలబాలికల విభాగంలో వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 2009 జనవరి 1లోపు జన్మించిన వారు ఇందులో పాల్గొనవచ్చని కన్నా తెలిపారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9059522986లో సంప్రదించాలని తెలిపారు.

పేకాట కేంద్రంపై దాడి

వరంగల్ క్రైం, మార్చి 9: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కరీమాబాద్‌లో ఒకరి నివాసంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్, ఎస్‌ఐ శరత్ ఆధ్వర్యంలో దాడి చేశారు. శనివారం నిర్వహించిన దాడిలో రూ.24వేల నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

కారు బేజారు

- రోజురోజుకూ బీఆర్ఎస్‌ను వీడుతున్న నాయకులు
- అడ్డుకట్ట వేయడంలో నాయకత్వం విఫలం



వరంగల్ క్రైం, మార్చి 9: బీఆర్ఎస్‌లో నాయకత్వ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. క్యాడర్ పార్టీనీ వీడుతున్నా అడ్డుకునే నాయకత్వం కరువైంది. బీఆర్ఎస్‌కు సంస్థాగతంగా నిర్మాణం లేకపోవడం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చవిచూశాక పార్టీ కేడర్ అధికార పార్టీ కాంగ్రెస్ వైపు వెళుతోంది. శాసనసభ ఎన్నికల అనంతరం ఒక్కొక్కరిగా పార్టీని వీడుతున్నారు. పదేళ్లు అధికారాన్ని అనుభవించిన పార్టీ నేతలు సైతం ఓటమిని తట్టుకోలేక పదవుల కోసం కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు. బడానేతలు భవిష్యత్ కోసం బీఆర్ఎస్‌ను వీడుతుండగా, వారి వెంట కేడర్ అంతా వలస బాట పడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ మనుగడ ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. పదేళ్లు అధికారాన్ని అనుభవించిన బీఆర్ఎస్ నేతలు.. అధికారం లేకుండా ఉండలేకపోతున్నారు. అధికారం కోల్పోయిన నెలరోజుల్లోనే బీఆర్ఎస్‌ను వీడుతున్నారు. కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా 12 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు ఎంపీ నియోజకవర్గాలున్నాయి. 2018లో జరిగిన ఎన్నికల్లో 12 అసెంబ్లీ స్థానాల్లో ములుగులో కాంగ్రెస్ విజయం సాధించగా, మిగతా 11 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు విజయం సాధించారు. ఆరు జిల్లాల జడ్పీలు, మండల పరిషత్‌లు సైతం బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. రెండు ఎంపీ స్థానాలు సైతం బీఆర్ఎస్ అభ్యర్థులే గెలిచారు. కాగా, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 12లో కేవలం రెండు (స్టేషన్ ఘనపూర్, జనగామ) మినహా 10 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అధికారంలో లేని బీఆర్ఎస్‌లో ఆపార్టీ క్యాడర్ ఉండలేకపోతున్నారు. పదవులు పదిలం చేసుకునేందుకు, భవిష్యత్‌లో పదవులు పొందేందుకు కాంగ్రెస్ బాటపడుతున్నారు. మూడు మాసాల్లోనే నర్సంపేట, పరకాల, వర్ధన్నపేట మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లాయి. వరంగల్ కార్పొరేషన్ మేయర్‌తో పాటు వరంగల్ తూర్పులోని 15మంది కార్పొరేటర్లు, పశ్చిమ నియోజకవర్గం నుంచి ఆరుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఎన్నికలకు ముందు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్ పార్టీని వీడారు.

తాజాగా శనివారం డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆయన సతీమణి ఐనవోలు ఎంపీపీ మధుమతి, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు ఐనవోలు, వర్ధన్నపేట మండలాల నుంచి పెద్దఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. రేపో మాపో వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని 10మంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. వీరు స్థానిక ఎమ్మెల్యే నాగరాజుతో మాటామచ్చట మాట్లాడుకున్నారు. శాసనసభ ఎన్నికల ముందే భూపాలపల్లి మున్సిపాలిటీకి చెందిన పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. మొత్తంగా బీఆర్ఎస్ క్యాడర్ అంతా కాంగ్రెస్ బాటపడుతుండటం విశేషం.

అడ్డుకునే నాయత్వం లేదు

కేడర్ ఖాళీ అవుతున్నా పట్టించుకునే నాయకత్వం కరువైంది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌కు సంస్థాగతంగా పటిష్ఠమైన నిర్మాణం లేకపోవడం పార్టీకి నష్టం చేకూర్చుతోంది. జిల్లా పార్టీ అధ్యక్ష పదవులు ఎమ్మెల్యేలకు కట్టబెడుతూ నిర్ణయం తీసుకున్న అధిష్ఠానం కిందిస్థాయిలో పార్టీ కమిటీలను ఏర్పాటు చేయలేదు. ఉద్యమ సమయంలో నియమించబడిన కమిటీలే ప్రస్తుతం చెలామణి అవుతున్నాయి. వీరికి సరైన గుర్తింపు లేకపోవడంతో కేడర్‌ను పట్టించుకున్న పాపానపోవడం లేదు. మూడు మాసాలుగా పెద్దఎత్తున బీఆర్ఎస్ కేడర్ కాంగ్రెస్‌లోకి జంప్ చేస్తుంటే కనీసం వద్దు అనే నేత కరువయ్యాడు. జిల్లా పార్టీ అధ్యక్షులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పార్టీ మారే వారితో చర్చించి బరోసా ఇచ్చే ప్రయత్నం చేసిన దాఖలాలు లేవు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఎమ్మెల్యేలుగా ఓటమి చెందిన అధ్యక్షులు పక్క చూపులు చూసే పరిస్థితి బీఆర్ఎస్‌లో నెలకొంది. వీరు కేడర్‌ను పట్టించుకునే స్థితి లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నట్లు కనిపిస్తోంది. మొత్తంగా బీఆర్ఎస్ భవిష్యత్ ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది.

ఈ సారైనా ‘గూడు’ కుదిరేనా?

(5వ పేజీ తరువాయి)

ఇళ్లు కూడా ఒకటి. ఈ నెల 11వ తేదిన సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలంలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. సొంత స్థలంలో కనీసం 400 చదరపు అడుగుల్లో ఇళ్లు నిర్మించుకోవాల్సి ఉంటుంది. ఈ ఇంటికి ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక సాయం చేయనున్నట్లు ప్రకటిం చింది. నాలుగు విడతల్లో ఈ ఆర్థిక సాయం లబ్ధిదా రులకు అందనుంది. మొదటి బేస్‌మెంట్ స్థాయిలో రూ.1లక్ష ఆర్థిక సాయం ప్రభుత్వం నుంచి రానుంది. అలాగే పైకప్పుకు మరో లక్ష రుపాయలు, ఆ తరువాత గోడల నిర్మాణం పూర్తి అయినా తరువాత మరో రూ.2లక్షలు సాయం అందించనున్నారు. ఇంటి నిర్మాణం మొత్తం పూర్తి అయినా తరువాత మిగతా రూ.1లక్ష కూడా లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నారు. ఎలాంటి ఇల్లు లేని, తెల్లరేషన్‌కార్డు ఉన్న నిరుపేదలే ఈ పథకానికి అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. గుడిసెలు, మట్టి గోడల ఇల్లున్న వారు కూడా ఇందిరమ్మ పథకానికి అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే ప్రజాపాలన ద్వారా దరఖాస్తు చేసుకున్నవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అయితే సొంత జాగా లేని అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం ఇందిరమ్మ పథకంలో భాగంగా జాగతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల సాయం చేస్తామని ప్రకటించింది. సోమవారం ప్రారంభమయ్యే ఇందిరమ్మ ఇళ్ల పథకంతో తమ సొంతింటి కల సాకారమవుతుందనే ఆశతో అర్హులైన పేదలు ఉన్నారు.

సీపీఐలోకి వేల్పుల సారంగపాణి



సీపీఐలో చేరినవారితో సాంబశివరావు

హనుమకొండ కలెక్టరేట్, మార్చి9: హనుమకొండకు చెందిన కార్మిక సంఘం నాయకుడు వేల్పుల సారంగపాణితోపాటు పలువురు నాయకులు శనివారం హైదరాబాద్‌లోని ముగ్దుం భవన్‌లో సీపీఐ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హనుమకొండలో కార్మిక సంఘం నాయకుడిగా పనిచేస్తున్న సారంగపాణి పార్టీలో చేరడం హర్షనీయమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ఆధ్వర్యంలో సారంగపాణితో పాటు కోమటి రమేష్, గండు సత్యంలు సీపీఐలో చేరారు.

సీపీఎం నుంచి సారంగపాణి బహిష్కరణ

వరంగల్ కార్పొరేషన్: సీపీఎం పార్టీ నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్న సీపీఎం జిల్లా నాయకుడు వేల్పుల సారంగపాణిని పార్టీ నుంచి బహిష్కరిస్తూ సీపీఎం జిల్లా అధ్యక్షుడు బొట్ల చక్రపాణి శనివారం ఆదేశాలు జారీ చేశారు. హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. పార్టీ నిర్మాణ పనులకు వ్యతిరేకంగా పని చేసిన వేల్పుల సారంగపాణిని బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఇక నుంచి సీపీఎం పార్టీకి సారంగపాణికి ఎటువంటి సంబంధం లేదని పార్టీ సభ్యులు, నాయకులు గమనించాలని చక్రపాణి సూచించారు.

యువతి ఆత్మహత్య



కాజీపేట, ఫిబ్రవరి 9: పీహెచ్‌డీ ఎక్కడ చేయాలో తేల్చుకోక , తీవ్ర మనస్థాపానికి గురై ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట సిద్ధార్థనగర్‌కు చెందిన బల్గూరి వేణుగోపాల్ - వకుల దంపతులకు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురు బల్గూరి వ్రిందా (28)కు ఇండియాలో , అమెరికాలో పీహెచ్‌డీ సీటు వచ్చింది. పీహెచ్‌డీ ఎక్కడ చేయాలో తేల్చుకోక తీవ్ర మనస్థాపానికి గురై గదిలోకి వెళ్లి శుక్రవారం రాత్రి ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఘటనా స్థలికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామన్నారు. తండ్రి వేణుగోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి తెలిపారు.

ఉద్యోగులపై హరీష్‌రావు వ్యాఖ్యలు సరికావు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 9: ఉద్యోగులపై మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు సరికావని జీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపెల్లి ప్రకాశ్ శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సకల జనుల సమ్మె ఉద్యోగుల కారణంగానే విజయవంతమైన సంగతి గుర్తు చేశారు. అలాంటి విషయాలను మరిచి మాజీ మంత్రి హరీష్‌రావు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. రైతులను గౌరవించాల్సిందే కానీ.. ప్రభుత్వంలో ఉద్యోగుల పాత్రను మరవద్దని హితవు పలికారు. వేతన బిల్లులు, పీఆర్సీ బకాయిలు, మెడికల్ బిల్లులు, జీపీఏ రుణాలు ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉంచిన వారి ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు అప్పటి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చూసి సహకరించిన సంగతిని గుర్తు చేశారు. హరీష్‌రావు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

బంగారం ఎరచూపి డబ్బులతో ఉడాయింపు

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన ● పోలీసులను ఆశ్రయించిన బాధితులు

బయ్యారం, మార్చి 9 : తాను ఆదాయపు పన్ను కార్యాలయంలో పనిచేస్తానని, తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానని చెప్పి ఓ వ్యక్తి పలువురిని మోసం చేసి డబ్బులతో ఉడాయించాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం చోక్లాతండాలో ఆలస్యంగా వెలుగుచూసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. చోక్లాతండాకు చెందిన సాయి అనే వ్యక్తి కొంత కాలంగా ఇతర ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నాడు. సుమారు ఏడాది కిందట చోక్లాతండాకు వచ్చిన సాయి.. క్రమేపీ సమీప బంధువులు, సుపరిచితులను మచ్చిక చేసుకుంటూ వారికి దగ్గరయ్యే ప్రయత్నం చేశాడు.

ఈ క్రమంలోనే తాను ఆదాయపు పన్ను కార్యాలయంలో పనిచేస్తానని.. తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానంటూ నమ్మబలుకుతూ పలువురి దగ్గర నుంచి అందినకాడికి దండుకున్నాడు. కొందరు అప్పులు చేసి డబ్బులు ముట్టజెప్పగా.. మరికొందరు ఆశకొద్ది పాత బంగారం తాకట్టు పెట్టి డబ్బులు ఇచ్చినట్లు తెలిసింది. చోక్లాతండాతో పాటు సమీప గ్రామాలతో కలుపుకొని దాదాపు 10మంది వ్యక్తుల నుంచి సుమారు రూ.40 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. రెండు నెలలుగా చోక్లాతండాకు సాయి రాకపోవటం, ఎక్కడ ఉన్నాడనే సమాచారం కూడా స్పష్టంగా తెలియకపోవటంతో అనుమానం వచ్చిన బాధితులు.. శనివారం స్థానిక పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఈ విషయమై బయ్యారం ఎస్సై ఉపేందర్‌ను వివరణ కోరగా.. సాయి అనే వ్యక్తి తమను మోసం చేసి డబ్బులతో ఉడాయించినట్లు పలువురు బాధితులు పేర్కొన్నారన్నారు. దీనిపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామని త్వరలోనే అన్ని విషయాలు వెల్లడిస్తామన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL CITY

వరంగల్ సిటీ

• వరంగల్ • ఖిలావరంగల్ • గీసుగొండ • సంగెం

ఆదివారం 10 మార్చి 2024

'ముదిరాజ్‌ల రిజర్వేషన్‌కు ఐక్య కార్యాచరణ'

సంగెం, మార్చి 9 : ఉద్యోగ సాధికారతకు పని చేస్తున్న మెప్మా రానున్న కాలంలో ముదిరాజ్‌ల రిజర్వేషన్ కోసం ఐక్య కార్యాచ రణ చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరటి రాజు చెప్పారు. సంగెంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజుతోపాటు నాయకులు సింగారేపు రామకృష్ణలు మాట్లాడారు. హైదరాబాద్‌లోని కోఠి వద్ద గల బీసీ భవన్‌లో ఆదివారం మెప్మా-ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర యూనియన్ సమావేశం జరగనున్నట్లు రాజు వివరించారు. ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగే సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కార్యవర్గ సభ్యులు హాజరు కానున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రవి, మహేష్, సుధాకర్, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎత్తిపోతల పథకం వివరాలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న అధికారులు

ఎత్తిపోతల పనులు త్వరగా పూర్తిచేయాలి: రేవూరి

పనుల్లో జాప్యంపై అధికారులపై ఆగ్రహం

గీసుగొండ, మార్చి 9: కొనాయిమాకుల ఎత్తిపోతల పనులను త్వరగా పూర్తిచేసి రైతులకు సాగునీరు అందివ్వాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎత్తిపోతల పంప్‌హౌస్‌ను శనివారం పరిశీలించారు. ఎత్తిపోతల పనుల పురోగతిని ఎస్సారెస్పీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతుందని, ఏ ఏజెన్సీ వారు ఎత్తిపోతల పనులు చేస్తున్నారని వివరాలను అడిగారు. అధికారులు సరిగా స్పందించకపోవటంతో.. 'ధర్మారెడ్డి ఏజెన్సీయేనా' అంటూ నిలదీశారు. దీంతో డీఈ రామకృష్ణ కాదు అంటూ సమాధానం చెప్పటంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే మరి ఎవరో చెప్పంటు ప్రశ్నించారు. తర్వాత డీఈ అవును సర్ అని చెప్పటంతో 'మీరు బీఆర్ఎస్ గవర్నమెంట్‌లో ఉన్నారనుకుంటున్నారా... నిజాలు చెప్పటానికి ఎందుకు భయపడుతున్నారు' అంటూ మండిపడ్డారు. కాల్వ తవ్వినప్పుడు తీసిన మట్టి ఏమైందని అధికారులను మరోసారి నిలదీశారు. వారి నుంచి స్పందన రాకపోవటంతో ఆగ్రహించిన ఆయన మట్టి మాయం గురించి పోలీలకు ఫిర్యాదు చేయాలని ఎంపీపీ భీమగాని సౌజన్యకు సూచించారు. విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగితే అక్రమ మట్టి తరలింపు బాగోతం బయటికి వస్తుందని అధికారులను తీవ్రంగా ఎమ్మెల్యే మందిలించారు. దీంతో డీఈ ఎత్తిపోతల పథకం సంబంధించి పూర్తి వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. రీడిజైన్‌లో ప్రాజెక్టు ఖర్చు మొత్తం రూ.139 కోట్లకు పెరిగిందంటూ డీఈ వెల్లడించారు. ఈ పథకం ద్వారా టీఎంసీ నీటి సరఫరా ద్వారా 1,450 ఎకరాల భూమికి సాగునీరు అందించనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, ఈఈ కృపాకర్, ఏఈ కిరణ్మయి, విద్యుత్ శాఖ ఏడీ భిక్షపతి, ఏఈ సంపత్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు చాడా కొమురారెడ్డి, కూసం రమేష్, వజ్ర రాజు, రహీంపాష, తాటికొండ నరేందర్, రాజేశ్వర్‌రావు, కేదాసి మోహన్ పాల్గొన్నారు.

నేడు ఉచిత శిక్షణకు ప్రవేశ పరీక్ష

వరంగల్ కలెక్టరేట్, మార్చి 9: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ ద్వారా ఐదు నెలలపాటు వివిధ ఉద్యోగాలకు నిర్వహించే పోటీ పరీక్షలకు ఈనెల 10 (ఆదివారం) హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ గౌరవ సంచాలకులు జగన్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణకు ప్రవేశ పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందన్నారు.

గవిచర్లలో నారీ శక్తి రన్



రన్‌లో పాల్గొన్న మహిళలు

సంగెం, మార్చి 9 : గవిచర్లలో శనివారం ఎస్ఎస్‌జీ మహిళలతో నారీ శక్తి ప్రోగ్రాం జరిగింది. వివిధ గ్రామాల నుంచి మహిళా సంఘాలు భారీగా హాజరై రన్‌లో పాల్గొన్నారు. నెహ్రూ యువ కేంద్రం అధికారి చింతల అన్వేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేంద్రం వలంటీర్లు వెల్దండి సురేష్, గాలి భిక్షపతి పాల్గొన్నారు.

'రవన్న ఆశయాలను కొనసాగిద్దాం'



అమరవీరుల స్థూపం వద్ద రవన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఖిలావరంగల్, మార్చి 9: భారత విప్లవోద్యమ చరిత్రలో చిరస్మరణీయుడు రాయల రవన్న ఆశయాలను కొనసాగించాలని సీపీఐ, ఎంఎల్- మాస్‌లైన్ (ప్రజాపంథా) వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి అన్నారు. శనివారం ఖిలావరంగల్ చెమన్‌వద్ద గల అమరవీరుల స్థూపం వద్ద రవన్న 8వ, వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎనిమిదేళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి రవన్న అమరుడయ్యారన్నారు. దేశంలో పెట్టుబడి దారి భూస్వాముల దోపిడీ పీడన అణచివేతల నుంచి ప్రజలను విముక్తి చేయడానికి, ఆదివాసీలకు భూమిపై హక్కు కల్పించడం కోసం అజ్ఞాతంలో ఉంటూ అనేక పోరాటాలు రవన్న చేశారన్నారు.

కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, సీపీఐ, ఎంఎల్-మాస్‌లైన్ జిల్లా నాయకుడు పాణి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పసునూరి రాజు, నాయకులు కట్కూరి వెంకటస్వామి, రాజేందర్ గాడిపెల్లి ప్రవీణ్, రాజు, ల్యాదళ్ళ ఎల్లయ్య, చంటి పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన నరేందర్

వరంగల్‌సిటీ, మార్చి 9: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును శనివారం వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ పరిస్థితి, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వ్యవహరించనున్న వ్యూహాలపై చర్చించుకున్నారు. అనంతరం మాజీ మంత్రి హరీష్‌రావును కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అనుసరించాల్సి వ్యూహాలపై చర్చించారు. కార్యక్రమంలో మసూద్, మరుపల్లి రవి, గందె నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.



కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆరోగ్యదాయిని కీరదోస!

కరీమాబాద్, మార్చి 9: వేసవిలో ఉపశమనం కలిగించమేకాక, పుష్కలంగా ఆరోగ్య పోషకాలు కీరదోసలో ఉన్నాయి. అందుకే దానికి డిమాండ్ ఎక్కువే. శరీరంలో నీటి శాతాన్ని తగ్గకుండా వేసవి నుంచి రక్షించే వాటిల్లో కీరదోస ఎంతోదోహద పడుతుంది. అనువైన ధరలో అందుబాటులో ఉండడంతో ప్రతీఒక్కరు వీటిని తింటుంటారు. ఇందులో విటమిన్ ఏ,సీ లతోపాటు పోటాషియం, మెగ్నీషియం, సిలికాన్‌తోపాటు అనేక పోషక పదార్థాలు ఉన్నాయి. బరువు తగ్గాలి అనుకునే వారికి కీరా గొప్పవరం. సీజన్‌తో సంబంధం లేకుండా లభించే కీరదోస తినడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. కీరదోస శాస్త్రీయ నామం కుకుమిస్ సాటైవస్, ఇది కుకుర్బిటసే రకానికి చెందినది. దీన్ని కీరదోసకాయ, కీర అని, సంస్కృతంలో ఉర్వరుక అని పిలుస్తారు.

పోషకాలు పుష్కలం..

కీర దోసకాయలో అనేక పోషక విలువలు ఉన్నాయి. నీటి శాతం ఎక్కువగా ఉండడంతో ఆకలి, దాహం తీర్చడంలో మెరుగ్గా పనిచేస్తుంది. 95శాతం నీటితో ఉండే కీరా వడదెబ్బ తగలదు. ప్రతీ 100గ్రాముల కీరాలో 95.23 నీటి పరిమాణం, 16కిలో కేలరీల శక్తి, 0.65 గ్రాముల ప్రోటీన్,0.11గ్రాముల ఫ్యాట్ (కొవ్వు), 11.05గ్రాముల కార్బోహైడ్రేట్, 3.63గ్రాముల ఫైబర్, 16 మిల్లిగ్రాముల మినరల్స్, కాల్షియం, 0.28 మిల్లిగ్రాముల ఐరన్, ఇంకా ఎన్నో విటమిన్లు, సూక్ష్మ పోషకాలు ఉంటాయి.

ఆరోగ్యానికి ఎంతో మేలు..

- కీరదోస జీర్ణశక్తికి దోహదపడుతుంది. పొట్టలోని టాక్సిన్లను బయటకు పంపిస్తుంది.
- పొట్టలో చెడు పదార్థాలు పేరుకుపోకుండా చూస్తుంది.





నగరంలో అమ్ముతున్న కీరదోసలు

ఆరోగ్య ప్రయోజనాలెన్నో..

- రోగనిరోధక శక్తిని పెంచే విటమిన్ సి, ఎముకల వృద్ధికి తోడ్పడే విటమిన్ కె, వంటి పోషకాలున్నాయి.
- పొటాషియం, మెగ్నీషియంతో అధిక రక్తపోటు అదుపులో ఉంటుంది.
- కీర ముక్కలు, పుదీనా కలిపి మిక్సీలో వేసి ఆ జ్యూస్ తాగితే డీ హైడ్రేషన్ రాకుండా ఉంటుంది.
- మూత్రపిండాల్లోని రాళ్లని తొలగిస్తాయి.
- కాల్షియం, విటమిన్ కె, శరీరంలోకి త్వరగా ఇంకడంతో ఎముకల సమస్యలు దరిచేరవు
- సిలికా మృదులాస్థి కణజాలంను పెంచడం ద్వారా కీళ్లనొప్పుల్ని రానివ్వదు. + కీరదోస తొక్కల్లోనూ, విత్తనాల్లోను బీటాకెరోటీన్ శాతం ఎక్కువ, అందుకే కంటి సమస్యలు ఉన్న వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.
- కీర క్యాన్సర్లను నియంత్రించడంలో వేగవంతంగా పనిచేస్తుంది. లారిసెరిసినాల్, పినోరేసినాల్, సెకోయి సోరిసినాల్ అనే లిగ్నన్లు అండాశయ, గర్భాశయ ప్రోస్టేట్ క్యాన్సర్లను తగ్గిస్తాయి.
- గ్లైకోసైడ్లు, ఫ్లేవనాయిడ్లు శరీరంలోని ఇన్సులిన్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు మధుమేహాన్ని అడ్డుకుంటాయి.
- సోడియం తక్కువగానూ, పొటాషియం, మెగ్నీషియంలు ఎక్కువగా ఉండటంతో బీపీ, హ్యాంగోవర్ల్ని రానివ్వదు.
- ఫిస్టిన్ అనే ఫ్లేవనాయిడ్స్ మెదడు పనితీరును ప్రభావితం చేయడం ద్వారా జ్ఞాపకశక్తిని పెంచుతుంది.
- చర్మ సౌందర్యాన్ని పెంపొందిస్తుంది. వీటిలోని రుటీన్, ఆస్కార్బిక్, ఆక్సిడేజ్ అనే పదార్థాలు ఫ్రీరాడికల్స్‌ను అడ్డుకుంటాయి
- బరువు తగ్గాలనుకునే వారికి కీరా మంచి ఆహారంగా ఉపయోగపడుతుంది.

పరమేశ్వరుడికి మహా అన్నపూజ



ఖిలావరంగల్ పంచముఖ నాగవీరేశ్వరాలయంలో ...



కరీమాబాద్ కాశీవిశ్వేశ్వరాలయంలో..

ఖిలావరంగల్, మార్చి 9: మహాశివరాత్రి ముగింపు సందర్భంగా శనివారం ఖిలావరంగల్‌లోని శ్రీస్వయం భూ- శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో అర్చకుడు శీలమంతుల శంభులింగం, 18వ డివిజన్ చెన్నారెడ్డికాల నీలోని పంచముఖ నాగవీరేశ్వరాలయంలో ప్రధాన అర్చకుడు శివశ్రీ భోగేశ్వరశాస్త్రి, శివనగర్‌లోని సీతారా మచంద్ర దేవాలయంలో అన్నపూజ కార్యక్రమాన్ని అర్చ కులు నిర్వహించారు. కార్యక్రమంలో కిరణ్‌శాస్త్రి, దేవాలయ ప్రధానకార్యదర్శి మామిడాల రమేష్, కోశాధికారి లక్ష్మయ్య, ధర్మకర్త ఆరుగొండ భూదేవి పాల్గొన్నారు.

- కరీమాబాద్: కరీమాబాద్‌లోని శ్రీ కాశీవిశ్వేశ్వర ఆలయంలో (బొమ్మలగుడి)లో శనివారం మహాశివుడికి అన్నపూజ నిర్వహించారు. శివరాత్రి మరుసటి రోజు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. శివలింగానికి ప్రధాన అర్చకులు శంకరశర్మ అభిషేకాలు చేసి, అన్నంతో అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వొగిలిశెట్టి అనిల్‌కుమార్, కొమ్మిని రాజేందర్, సురేష్, కమటం రాజేష్, కోల మధు, నాగపూరి అశోక్, బైరిశెట్టి మల్లేశం, కొండూరు శివ ప్రసాద్, అజయ్, ప్రవీణ్, వేణు, నాగరాజు, రంజిత్, వంశీ, మధుసూదన్, సంజీవ్, సరిత, నాగమణి పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు నివాళులర్పించిన జగిత్యాల జడ్జి



శ్రీనివాస్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న జడ్జి ప్రసాద్

కరీమాబాద్, మార్చి9: హుజూరాబాద్‌లో ఐసీడీఎస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పస్తం శ్రీనివాస్ అనారోగ్యంతో మృతిచెందగా, ఆయన బాల్య మిత్రుడు జగిత్యాల జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కంచె ప్రసాద్ శనివారం నివాళులర్పించారు. వరంగల్‌లోని శంభునిపేట ప్రాంతం బుడగజంగాల కాలనీకి చెందిన శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం కన్నుమూశారు. 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మస్వామి, మండల హేమంత్, గుండు పూర్ణచందర్, దేవులపల్లి కమలాకర్, దామెరకొండ కర్ణాకర్, బజ్జూరి వీరేశం, కందికొండ మోహన్, బుక్క సతీష్, శెంకేశి లింగమూర్తి, శెంకేశి సుధాకర్, మాదవ్, కేదాసి ప్రవీణ్, పత్తి మల్లికార్జున్, హరిశంకర్, నూరుద్దీన్, వెంకన్న, రాజ్ కుమార్‌లు పాల్గొని శ్రీను కుటుంబ సభ్యులతో పాటు సోదరులైన హుస్నాబాద్ పీపీ పస్తం రామకృష్ణ, రవి కిరణ్‌లను పరామర్శించారు. శంభునిపేట పరపతి సంఘంలో సభ్యుడైన శ్రీనివాస్‌కు రూ.30వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కోమాకుల రాజేంద్రప్రసాద్, పూర్ణకుమార్, ప్రధాన కార్యదర్శి బేతి బలరాం, కోశాధికారి దేవులపెల్లి కమలాకర్, ఆర్గనైజర్ పస్తం భిక్షపతి, మోర వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

గీసుగొండ సీఐగా పవన్‌కుమార్



గీసుగొండ, మార్చి 9: గీసుగొండ నూతన సీఐగా పవన్‌కుమార్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. కొద్ది రోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించిన సీఐ బాబులాల్‌ను ఉన్నత అధికారులు బదిలీ చేసి ఆయన స్థానంలో ఇంతేజార్‌గంజ్‌లో విధులు నిర్వహిస్తున్న పవన్‌కుమార్‌ను నియమించారు. కాగా పవన్‌కుమార్‌ను ఎస్ఐలు వెంకన్న, జానీపాష, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు



ఏకశిలానగర్, మార్చి 9: మంచిర్యాల జిల్లా మందమర్రిలో ఈనెల 3నుంచి జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్- 2024 పోటీల్లో కరీమాబాద్‌లోని కిడ్స్ హై స్కూల్ విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ దాసి సతీస్ మూర్తి శనివారం తెలిపారు. ఎస్.వరుణ్, యోజిత్, యతిష్వర్, జే లలిత్, సాత్విక్, ఇ.అర్షిత, బి.పావని, ఎమ్డీ సోనమ్, జి.విష్ణువర్ధన్, ఎస్‌కే ఆమాస్, అశ్విక్‌సాయి, విఘ్నేష్, మోక్షజ్ఞలు కటాస్, కుమిటీ విభాగాల్లో బంగారు, వెండి పతకాలు సాధించినట్టు వెల్లడించారు. సాదించారు. పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు విద్యార్థులతోపాటు కోచ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అన్నదేవర ప్రవీణ్‌కుమార్, పీఈటీలు కె.రాజు, వెంకటేష్, కరాటే, కిక్ బాక్సింగ్ కోచ్‌లు బండారి సంతోష్, రణదీప్ పాల్గొన్నారు.

ధర్మారంలో ఉచిత వైద్యశిబిరం

గీసుగొండ, మార్చి 9: ధర్మారంలో జనప్రియ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. 108 మందికి మధుమేహ వ్యాధి పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుల్లూరి సంపత్‌కుమార్, లక్ష్మీసుమతి, భద్రయ్య, రమేష్, మురళి, జనార్దన్ జ్యోతి పాల్గొన్నారు.

'చందారులకు కానుకలు అందిస్తాం'

కరీమాబాద్, మార్చి 9 : రంగశాయిపేటలో బొడ్రాయి ఉత్సవాలకు సహకరించిన దాతలకు కానుకలు అందిస్తామని కొల్లూరి రిషినంద్ ట్రస్టు చైర్మన్ కొల్లూరి యోగానంద్ తెలిపారు. శనివారం రంగశాయిపేటలోని తన నివాసంలో దాతలకు అందించనున్న కానుకలకు సంబంధించిన వివరాల కరపత్రాలను ట్రస్టు సభ్యులతో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గ్రాము చొప్పున పది మందికి బంగారు బిల్లలు, 15వెండి ప్రమిదలు, 50 రాగి కలషాలు, 50 మంగళ హారతులు, వంద పూలబుట్టల రూపంలో అందించనున్నట్లు వెల్లడించారు. 28న రంగశాయిపేట మహంకాళి దేవాలయ ప్రాంగణంలో పెద్దల ఆధ్వర్యంలో డ్రా నిర్వహించి బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. జనతా, వినాయక, పరపతి సంఘం, సాయినగర్ కాలనీ, తెలంగాణ కాలనీ, రామాలయం, ఎల్లమ్మ ఆలయాల వద్ద కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

సంగెం, మార్చి 9 : క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి ఎంతగానో దోహదం చేస్తాయని మామునూరు జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పూర్ణిమ చెప్పారు. తిమ్మాపురం హవేలిలో శనివారం రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ బాల్ బాడ్మింటన్ క్రీడోత్సవాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడాకారులకు భీరం రాంరెడ్డి ఆధ్వర్యంలో జనార్దన్ రెడ్డి-తానుజల జ్ఞాపకార్థం భోజన వసతి కల్పించారు. ఏకశిల యూత్ అసోసియేషన్ అండ్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోటీలకు 16 బాల్‌బాడ్మింటన్ టీంలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ స్థాయిబాల్ బాడ్మింటన్ క్రీడాకారులు కల్లెపు సురేందర్, బొల్లు యాకయ్య, అసోసియేషన్ సభ్యులుపాల్గొన్నారు.

రైలు ఢీకొని గొర్రెల కాపరి, గొర్రెలు మృతి



పోశాలు(ఫైల్)

గిర్మాజీపేట, మార్చి 9: వరంగల్-కాజీపేట రైల్వేస్టేషన్‌ల మధ్య శనివారం రాత్రి శాయంపేట రైల్వేగేటు సమీపంలో రైల్వే పట్టాలు దాటుతూ గొర్లకాపరితోపాటు, సుమారు 70గొర్రెలు మృతిచెందాయి. వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ కథనం ప్రకారం. హనుమకొండలోని న్యూశాయంపేటకు చెందిన గొర్రెల కాపరి చల్లా పోశాలు(57) తనకున్న సుమారు 70 గొర్రెలను రైల్వే ట్రాక్ ఆవలివైపు తీసుకుపోయి మేపి సాయంత్రం ఇంటికి వస్తుంటాడు. రోజువారి మాదిరిగానే శనివారం ఉద యం వెళ్లిన పోశాలు రాత్రి 7.30గంటల ప్రాంతంలో గొర్రెల మందను తీసుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. న్యూశాయంపేట రైల్వేగేటు వద్ద ట్రాక్ దాటుతున్న సమయంలో కాజీపేట నుంచి వరంగల్ వైపు వస్తున్న శాతవాహన ఎక్స్‌ప్రెస్ పోశాలుతోపాటుగా మందను ఢీ కొట్టింది. దీంతో పోశాలు అక్కడికక్కడే మృతిచెందగా, 70 వరకు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ సమాచారం అందుకున్న సీఐ జి.నరేష్, హెడ్‌కానిస్టేబుల్ రాజు సంఘటనా స్థలానికి చేరుకుని పోశాలు మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించి, కుటుంబ సభ్యులకు సమాచార మిచ్చారు. హెడ్ కానిస్టేబుల్ పి.రాజు కేసు దర్యాప్తు సీఐ తెలిపారు.



హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

కాశీవిశ్వేశ్వరాలయంలో హుండీ లెక్కింపు

వరంగల్‌సిటీ, మార్చి 9: కాశిబుగ్గ శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో శనివారం జాగరణ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నపూజ నిర్వహించారు. శివరాత్రిసందర్భంగా భక్తులు హుండీలలో వేసిన డబ్బులను శనివారం లెక్కించారు. వరాల హుండీ, గండదీపం, ఇతర హుండీల ద్వారా వచ్చిన డబ్బులు రూ.68,520, అభిషేకం ద్వారా రూ.లక్షా 18 వేల 500, అర్చన ద్వారా రూ.32వేల 600, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.34వేల 640, కట్నాలు రూ.70 వేల 310, కొబ్బరి చిప్పల ద్వారా రూ.5 వేల 500 మొత్తం రూ.3 లక్షల 30 వేల 70 కమిటీ లెక్క చూపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఏసీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ తిరుపతి

సంగెం, మార్చి9: త్వరలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు ఉంటాయని మామునూరు ఏసీపీ తిరుపతి చెప్పారు. సంగెం పోలీసు స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల నియమావళిను పాటిస్తూ రాజకీయ పార్టీల నాయకులు వవ్యహరించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలకు తావివ్వకుండా ఆయా ప్రాంతాల నాయకులు తగు జాగ్రత్తలు తీసుకొని మసులుకోవాలన్నారు. కార్యక్రమంలో పర్వతగిరి సీఐ శ్రీనివాస్, సంగెం ఎస్ఐ ఎల్.నరేష్ పాల్గొన్నారు.

సమాజాన్ని చైతన్యపర్చేది నాటక రంగమే..

5వ పేజీ తరువాయి

హైదరాబాద్ వారి మూల్యం నాటిక, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా తెలుగు కళాసమితి విశాఖ పట్టణం వారి నిశ్శబ్దమా నీ ఖరీదెంతా నాటికలు నిలిచాయి. ఉత్తమ ప్రేక్షక బహుమతి పాక సురేశ్, ఉత్తమ సంగీతం స్వప్నం రాల్చిన అమృతంకు సంగీతం అందించిన సాయితేజ, ఉత్తమ సహాయ నటిగా ఇంద్రప్రస్థం నాటికలో సౌందర్య పాత్రధారిణి నాగ కుసుమసాయి, ఉత్తమ సహాయ నటుడిగా కౌలస్య సుప్రజా రామా నాటికలో రామం పాత్రధారి గోపరాజు వినయ్, ఉత్తమ ప్రతినాయకుడిగా రైతే రాజు నాటికలో అబద్ధం పాత్రధారి కొల్ల రాధాకృష్ణ బహుమతి అందుకున్నారు.

అలాగే ఉత్తర రంగ అలంకరణ ఇంద్రప్రస్థం నాటికకుగాను శివరామకృష్ణ, ఉత్తమ హాస్యనటుడిగా అవ్వ అప్పచ్చి నాటికలో రాంబాబు పాత్రధారి రమేశ్, ఉత్తమ క్యారెక్టర్ నటుడి బంధం నాటికలో సుబ్బారాయుడి పాత్రధారి జీవీ.పురుషోత్తం, ఉత్తమ నటిగా మూల్యం నాటికలో జయంతి పాత్రధారిణి జ్యోతిరాజ్ బీశెట్టి, ఉత్తమ నటుడి నిశ్శబ్దం నీ ఖరీదెంత నాటికలో కుమార్ పాత్రధారి వరప్రసాద్‌రావు, ఉత్తమ రచనగా రైతే రాజు నాటక రచయిత కంచర్ల సూర్యప్రకాశ్, ఉత్తమ దర్శకత్వం కౌలస్య సుప్రజా రామా దర్శకుడు జి.విజయ్ అందుకున్నారు.

'ముదిరాజ్‌ల రిజర్వేషన్‌కు ఐక్య కార్యాచరణ'

సంగెం, మార్చి 9 : ఉద్యోగ సాధికారతకు పని చేస్తున్న మెప్మా రానున్న కాలంలో ముదిరాజ్‌ల రిజర్వేషన్ కోసం ఐక్య కార్యాచ రణ చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరటి రాజు చెప్పారు. సంగెలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజుతోపాటు నాయకులు సింగారేపు రామ కృష్ణలు మాట్లాడారు. హైదరాబాద్‌లోని కోఠి వద్ద గల బీసీ భవన్‌లో ఆదివారం మెప్మా-ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర యూనియన్ సమావేశం జరగనున్నట్లు రాజు వివరించారు.

ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగే సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కార్య వర్గ సభ్యులు హాజరు కానున్నట్లు వివరించారు. కార్యక్రమం లో సీనియర్ నాయకులు రవి, మహేష్, సుధాకర్, మండ లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

మునిసిపల్ కమిషనర్ జోనా


పన్నులు వసూలు చేస్తున్న కమిషనర్ జోనా

వర్ధన్నపేట, మార్చి 9: వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని వర్ధన్నపేట మునిసిపల్ కమిషనర్ జోనా అన్నారు. శనివారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఇంటి పన్నులు వసూలు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ జోనా మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీలోగా ఇంటి, నల్లా పన్నులు వందశాతం వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మేనేజర్ కిరణ్, ఇన్‌చార్జి ఆర్ఐ శ్రావణ్ కుమార్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎక్సైజ్ వాహనాల వేలం

నర్సంపేట టౌన్, మార్చి 9 : నర్సంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ నరేష్‌రెడ్డి శనివారం తెలిపారు. ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారుల సమక్షంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో వేలం పాట నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి గల వారు ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో కార్యాలయంలో 11న ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సీఐ వివరించారు.

రికార్డుల్లో ఒకచోట..

- నిర్వహణ మరో చోట..
- అయోమయంగా నెక్కొండ గురుకులం
- స్థలం కేటాయించని అధికారులు

నెక్కొండ, మార్చి 9 : నెక్కొండ పరిసర మండలాలోని గ్రామాల్లో గిరిజన తండాలు అత్యధికంగా ఉండటంతో ఈ ప్రాంత విద్యార్థులకు ఉచితంగా ప్రాథమిక విద్యను అందించుటకు గాను రాష్ట్ర ప్రభుత్వం 2017లో నెక్కొండకు మహాత్మ జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను కేటాయించింది. పాఠశాలను నెక్కొండలోని అద్దెభవనంలో ప్రారంభించిన అధికారులు మూడు సంవత్సరాల తరువాత భవనంలో సౌకర్యాలు లేని కారణంగా తాత్కలికంగా పాఠశాలను ఖానాపురం మండలానికి తరలిస్తున్నామంటూ తెలుపడంతో విద్యార్థుల తల్లిదండ్రులు వ్యతిరేకించారు. అధికారుల నిర్ణయాలను నిరసిస్తూ రాస్తారోకో, ధర్నాలు సైతం చేపట్టారు. అయితే భవన నిర్మాణం జరిగిన వెంటనే తిరిగి నెక్కొండకు గురుకుల పాఠశాలను తరలిస్తామంటూ విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించి గురుకుల పాఠశాలను ఖానాపురం మండలానికి తరలించారు. ప్రస్తుతం ఈ పాఠశాల ఆ మండలంలోని ఐనపల్లిలో కొనసాగుతోంది. ఇందులో ఐదు నుంచి పదో తరగతి వరకు ఏ, బీ సెక్షన్‌లు ఉండగా మొత్తం 465 మంది విద్యార్థినులు విద్య నభ్యసిస్తున్నారు.



ఖానాపురం మండలం ఐనపల్లిలో ఏర్పాటు చేసిన నెక్కొండ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల బోర్డు

సర్వేతో సరి...

గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి గాను మండలంలోని పత్తిపాక గ్రామ సమీపంలోని సర్వే నెంబరు 95లో స్థలం కేటాయించుటకు గాను 2018 లో అధికారులు సర్వే నిర్వహించారు. కానీ నేటి వరకూ సర్వే ఫలితాలు రికార్డులోనే ఉన్నాయి తప్పా ఎలాంటి పురోగతి లేదు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామంటూ దాటవేస్తున్నారు.

నాయకులు చొరవ చూపాలి



విద్యా రంగంలో ఎంతగానో వెనుకబడిన నెక్కొండ ప్రాంతంలోని విద్యార్థులకు ఉచిత విద్యను అందించుటకుగురుకుల పాఠశాల ఏర్పాటు చేయించాలంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరగా గురుకుల పాఠశాలను మంజూరు చేశారు. పాఠశాల భవనం నిర్మాణానికి స్థలం కేటాయించిన వెంటనే నిధులను మంజూరు చేయిస్తానంటూ చెప్పినా స్థలం కేటాయింపులో అధికారులు జాప్యం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురుకుల పాఠశాలల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరికి శ్రీకారం చుట్టినట్లుగా ఇటీవల ప్రకటించారు. స్థానిక నేతలు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తే ఈ ప్రాంత విద్యార్థులకు మేలు జరుగుతుంది.

- గటిక అజయ్‌కుమార్, నెక్కొండ మాజీ ఎంపీపీ

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చెన్నారావుపేట, మార్చి 9: మండలంలోని జల్లి గ్రామానికి చెందిన యువకుడు రహీమ్‌పాషా ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ముబారక్ మైనారిటీ యూత్ ఆధ్వర్యంలో శనివారం రూ. 30 వేలను ఆర్థిక సాయంగా అందించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు మొహమ్మద్ సజీమోద్దిన్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ రఫీ, కార్యదర్శి మైనుబభ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గొర్రెల కాపరి, గొర్రెలు మృతి

గిర్మాజీపేట, మార్చి 9: వరంగల్- కాజీపేట రైల్వేస్టేషన్‌ల మధ్య శనివారం రాత్రి శాయంపేట రైల్వేగేటు సమీపంలో రైల్వే పట్టాలు దాటుతూ గొర్లకాపరితోపాటు, సుమారు 70గొర్రెలు మృతిచెందాయి. వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ కథనం ప్రకారం. హనుమకొండలోని న్యూశాయంపేటకు చెందిన గొర్రెల కాపరి చల్లా పోశాలు(57) తనకున్న సుమారు 70 గొర్రెలను రైల్వే ట్రాక్ అవలివైపు తీసుకుపోయి మేపి సాయంత్రం ఇంటికి వస్తుంటాడు. రోజువారి మాదిరిగానే శనివారం ఉదయం వెళ్లిన పోశాలు రాత్రి 7.30గంటల ప్రాంతంలో గొర్రెల మందను తీసుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. న్యూశాయంపేట రైల్వేగేటు వద్ద ట్రాక్ దాటుతున్న సమయంలో కాజీపేట నుంచి వరంగల్ వైపు వస్తున్న శాతవాహన ఎక్స్‌ప్రెస్ పోశాలుతోపాటుగా మందను ఢీ కొట్టింది. దీంతో పోశాలు అక్కడిక్కడే మృతిచెందగా, 70 వరకు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ సమాచారం అందుకున్న సీఐ జి.నరేష్, సంఘటనా స్థలానికి చేరు కుని పోశాలు మృతదేమాన్ని ఎంజీఎం మార్చురికి తరలించి, కుటుంబ సభ్యులకు సమాచార మిచ్చారు. కేసు దర్యాప్తు సీఐ తెలిపారు.

హక్కుల సాధనకు మహిళలు ఉద్యమించాలి

సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి



నర్సంపేటలో మాట్లాడుతున్న మాధవి

నర్సంపేట, మార్చి 9 : మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్రనాయకురాలు కాసుమాధవి మహిళా నాయకులకు పిలుపునిచ్చారు. పట్టణంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ నాడు సమానత్వం కోసం పోరాడి అమరులైన వీరవనితల బలిదానం రోజున అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోరాటాల ఫలితంగానే బాల్యవివాహాలనిషేదచట్టం, ప్రత్యేక వివాహచట్టం, వరకట్న నిషేద చట్టం, సమానపనికి సమాన వేతన చట్టం, కుటుంబ కోర్టు చట్టం, భ్రూణహత్యల నిరోధక చట్టం ర్యాగింగ్ నిరోధక చట్టం, గృహహింసచట్టం నిర్భయలాంటి అనేక చట్టాలు అమలయ్యాయని ఆమె పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా, హక్కుల సాధనకోసం మహిళలు ఉద్యమాంచాలని మాధవి పిలుపునిచ్చారు. కార్య క్రమంలో మహిళాసంఘం నాయకులు వజ్జంతి విజయ, స్వప్న, ఉదయగిరి నాగమణి,లక్ష్మి, యాకలక్ష్మి, సీఐటీయూ నాయకులు హన్మకొండ శ్రీధర్, కందికొండ రాజు, కలకోట్ల అనిల్, విలియంకేరి పాల్గొన్నారు.

రాయల రవన్న ఆశయాలను కొనసాగించాలి

ప్రజాపంథా జిల్లా కార్యదర్శి చిర్ర సూరి



నర్సంపేటలో రాయల రవన్న వర్ధంతి సభలో మాట్లాడుతున్న చిర్ర సూరి

నర్సంపేట టౌన్, మార్చి 9 : సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి రాయల రవన్న అలియాస్ సుభాష్‌చంద్రబోస్ ఆశయాలను కొనసాగించాలని ప్రజాపంథా జిల్లా కార్యదర్శి చిర్ర సూరి పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం రవన్న వర్ధంతి సభను అడ్డూరి రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో తాడిత, పీడిత, ఆదివాసీ ప్రజల రాజ్యం తీసుకురావాలని విప్లవోద్యమంలో 48 సంవత్సరాలు అజ్ఞాత దళనేతగా పనిచేస్తూ అనారోగ్యంతో ఎనిమిది సంవత్సరాల క్రితం అమరుడయ్యాడన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రజలు విప్లవోద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాణి, జవహర్‌లాల్, మనోహర్, సుధాకర్, జావెద్, రాజేందర్, భద్రాచారి, సలీం, నరేష్ పాల్గొన్నారు.

- చెన్నారావుపేట: రవన్న ఆశయ సాధన కోసం కృషి చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ నెక్కొండ, చెన్నారావుపేట సంయుక్త మండలాల కార్యదర్శి అడ్డూరి రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో భారత విప్లవోద్యమ నేత కామ్రేడ్ రాయల రవన్న 8 వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల విముక్తి కోసం అజ్ఞాత జీవితాన్ని గడిపిన రవన్న విప్లవోద్యమంలో నిత్యం చిరస్మరణీయుడని అన్నారు. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల మధ్య కుల, మతాల చిచ్చు పెడుతుందన్నారు. రానున్న ఎన్నికలల్లో కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జవహర్‌లాల్, మనోహరాచారి, రాజేందర్, శేఖర్, అల్లం నారాయణ, బాలు తదితరులు పాల్గొన్నారు.

పత్తినాయక్ తండాలో వన్‌కే రన్ పోటీలు


పత్తినాయక్‌తండాలో వన్‌కే రన్ ర్యాలీలో పాల్గొన్న మహిళలు

చెన్నారావుపేట, మార్చి 9: మండలంలోని పత్తినాయక్ తండాలో నెహ్రూ యువ కేంద్రం వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నారీ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు 1కే రన్ పోటీలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ జాటోతు యాకుబ్ మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా, సామాజికంగా ఎదగాలన్నారు. మహిళలు అన్ని రంగాలల్లో రాణించాలాన్నారు. అనంతరం 1కే రన్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బానోతు మోహన్, శ్రీనివాస్, బానోతు వెంకన్న, నాగరాజు, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ట్రాఫిక్ ఐల్యాండ్ నిర్మాణ పనులు

- పూర్తికాక ముందే ధ్వంసమవుతున్న వైనం
- పట్టించుకోని మునిసిపల్ అధికారులు


వరంగల్ క్రాస్‌రోడ్డు వద్ద అసంపూర్తిగా ఉన్న ఐల్యాండ్ నిర్మాణ పనులు, ఇన్‌సెట్‌లో ధ్వంసమైన ఐల్యాండ్ గోడ

నర్సంపేట టౌన్, మార్చి 9 : నర్సంపేట పట్టణంలో ప్రధాన కూడళ్లల్లో ట్రాఫిక్ ఐల్యాండ్ (జంక్షన్)ల నిర్మాణ పనులు అస్తవ్యస్థంగా తయారయ్యాయి. మునిసిపల్ అధికారులు, పాలకవర్గ నిర్లక్ష్యంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. పట్టణంలోని పాఖాల్‌రోడ్డు సెంటర్, వరంగల్ క్రాస్‌రోడ్డు వద్ద జంక్షన్‌ల నిర్మాణ పనులను చేపట్టిన కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేయడంతో ప్రధాన సెంటర్లు బోసిపోయి కనిపిస్తున్నాయి. పట్టణాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో గత ప్రభుత్వం రూ. 35 కోట్ల నిధులను విడుదల చేయగా అందులో జంక్షన్‌ల నిర్మాణ పనులు జరగాల్సి ఉంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారులు, మునిసిపల్ ప్రజాప్రతినిధుల పట్టింపులేనితనంతో పనులు ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉన్నాయి.

నాణ్యత లోపంతో కాంట్రాక్టర్ పనులు చేయడంతో నిర్మాణ దశలోనే జంక్షన్ గోడలు ధ్వంసమవుతున్నాయి. నర్సంపేట పట్టణంలోకి ప్రవేశించగానే కనబడేటలు వంటి వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద నాలుగు నెలల క్రితం ట్రాఫిక్ ఐల్యాండ్ నిర్మాణ పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ ఇటీవల నిర్మాణం పూర్తి కాక ముందే చేతులెత్తేశాడు. దీంతో నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. దీనికితోడు పనులలో నాణ్యతలోపం వల్ల ఐల్యాండ్ చుట్టూ ఉన్న ప్రహారీగోడ ధ్వంసమవుతోంది. ఇప్పటికైనా ట్రాఫిక్ ఐల్యాండ్ నిర్మాణ పనులు నాణ్యతతో త్వరిగతిన పూర్తి చేయాలని పట్టణప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

జీరో కరెంటు బిల్లు ప్రారంభం


జీరో కరెంటు బిల్లును అందజేస్తున్న మాజీ సర్పంచ్ రమేష్

చెన్నారావుపేట, మార్చి 9: మండలంలోని అమీనాబాద్ లో జీరో కరెంటు బిల్లును మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసెండెంట్ సిద్దెన రమేష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు బిల్లులను అందించటం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు బండి హరీష్, బాలరాజు, సిద్దెన మల్లేష్, డైరెక్టర్ మల్లాటి వీరారెడ్డి, బానోతు రవికుమార్, రాజు, విజయ్, అమ్మ చిరంజీవి, యాకయ్య, తిరుపతి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం

చెన్నారావుపేట, మార్చి 9: మండలంలోని ఎల్లాయిగూడెంలో విశ్వ బ్రహ్మణ సంఘం వారి ఆధ్వర్యంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని శుక్రవారం రాత్రి శివపార్వతులు కళ్యాణం ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చరణల మధ్య స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం జాగారం ఉన్న భక్తుల కోసం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి బుర్రకథను కంటేయపాలెంనకు చెందిన రామన్నగౌడ్ కళాబృందం వారు వినింపించారు. ఈ కార్యక్రమంలో మంచోజు వెంకన్న, మంచోజు శ్రీమన్ననారయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పూరి గుడిసెల దగ్ధం


సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పర్వతగిరి, మార్చి 9: ప్రమాదవశాత్తు మూడు పూరిగుడిసెలు దగ్ధమైన ఘటన మండలంలోని చెరువుకొమ్ముతండాలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తండాకు చెందిన దరావత్ ధర్మ కొత్త ఇంటిని నిర్మించుకుంటున్నాడు. ఈక్రమంలో పక్కనే పూరి గుడిసె వేసుకుని నివాసం ఉంటున్నాడు. శనివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు ఆ పూరి గుడిసెలో మంటలు చెలరేగాయి. దీంతో ధర్మ ఇంటితో పాటు దరావత్ ఇజ, దరావత్ శ్రీను ఇండ్లు కూడా దగ్ధమయ్యాయి. ఇళ్లల్లో ఉన్న నిత్యావసర వస్తువులు, సామాగ్రి, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకన్న, తహసీల్దార్, వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్, ఆర్ఐ భారతి, సెక్రటరీ రమాదేవి సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. తక్షణసాయం కింద నిత్యావసర సరుకులు అందిస్తామని, ప్రభుత్వపరంగా ఆర్థికసహాయం అందించేందుకు కృషిచేస్తామని తెలిపారు.

విద్యుదాఘాతానికి గురైన రైతు

ఆస్పత్రికి తరలింపు


గాయపడిన రైతును విద్యుత్ స్తంభంపై నుంచి కిందకు దింపుతున్న రైతులు

నెక్కొండ, మార్చి 9 : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి రైతు గురైన ఘటన మండలంలోని గొట్లకొండ గ్రామ శివారు మామిడితోట తండాలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు ఇస్లావత్ శ్రీనివాస్ భార్య కవితతో కలసి శనివారం పొలం వద్దకు వెళ్లి వ్యవసాయ మోటర్ ఆన్ చేశాడు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా మోటారు ఆన్ కాలేదు. దీంతో సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేయకుండా లైన్ (ఫేస్) మార్చుటకు విద్యుత్ స్థంభం ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు శ్రీనివాస్ కాళ్లకు తగలడంతో షాక్‌కు గురై స్థంభంపైనుంచి కిందకు వేలాడాడు. వెంటనే అక్కడే ఉన్న అతని భార్య గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో వ్యవసాయ పనులో ఉన్న మరో రైతు హచ్చా పరుగున వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసి వెంటనే అతడిని కిందికి దించారు. అప్పటికే శ్రీనివాస్ కాళ్లకు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడిని వరంగల్‌లోని ఓ ప్రవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా శ్రీనివాస్ విద్యుత్ అధికారులకు ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విద్యుత్ స్థంభం ఎక్కడాని నెక్కొండ విద్యుత్ ఏఈ చిరంజీవి తెలిపారు.

భవనం నిర్మించారు.. సేవలు మరిచారు..

దుగ్గొండి, మార్చి 9: పల్లెల్లో మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలనే లక్ష్యంతో ఆయుష్మాన్ ఆరోగ్య పథకం కింద ప్రభుత్వం ఆరోగ్య ఉప కేంద్రాలలో పల్లె దవాఖానాల భవనాలు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టింది. ప్రతీ పల్లె దవాఖానాలో డాక్టర్‌ను నియమించడం జరిగింది. మండలంలోని వెంకటాపురంలో నిర్మాణం చేసిన పల్లె దవాఖానా ప్రారంభంచేసి వైద్య సేవలను భవనంలోనే కొనసాగుతున్నాయి. తొగర్రాయి, మందపల్లి ఉప కేంద్రాలలో భవనాల పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. తిమ్మంపేట, మల్లంపల్లి భవనాల నిర్మాణాలు పూర్తి చేసి రెండు నెలలు కావడంతో పాటు డాక్టర్లు సైతం అందుబాటులో ఉన్న ఉన్నప్పటికీ భవనాల ప్రారంభంలో జాప్యం జరుగుతుందని పలువురు వాపోతున్నారు. వెంటనే వైద్య అధికారులు చొరవ చూపి నిర్మాణం పూర్తయిన భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పక్క భవనాలు పూర్తి కాబడిన అరకొర వసతుల మధ్య వైద్య సేవలు అందించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పల్లె దవాఖానా భవనాలు


తిమ్మంపేటలో నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పల్లె దవాఖానా భవనం

త్వరలోనే వైద్య సేవలు ప్రారంభిస్తాం..

మండలంలోని తిమ్మంపేట, మల్లంపల్లిలోని ఉప కేంద్రాలలో పల్లె దవాఖానా భవనాల నిర్మాణం పూర్తి కావడం జరిగింది. ఇటీవలనే సంబంధిత కంట్రాక్టర్ భవనాలకు సంబంధించిన వివరాలు తెలిపారు. వెంటనే స్వాధీనం చేసుకొని భవనాలలోనే ప్రజలకు వైద్య సేవలు ప్రారంభిస్తాం.

- కిరణ్‌రాజు, వైద్యాధికారి, దుగ్గొండి

పాతమగ్దుంపురంలో పడకేసిన పారిశుధ్యం

పట్టించుకోని పంచాయతీ సిబ్బంది


రోడ్డు పక్కనే నిలిచిన మురుగు నీరు

చెన్నారావుపేట, మార్చి 9: మండలంలోని పాత మగ్దుంపురంలో పారిశుధ్య లోపంతో మురుగు నీరు ప్రవాహిస్తున్న పట్టించుకోనే వారు లేరని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న ఓ ప్రైవేటు వాటర్ ప్లాంటు కారణంలో వృధాగా వచ్చే నీళ్ల రోడ్డు ప్రక్కనే నిలుస్తుందని దీంతో దోమలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రక్కనే సైడ్ కాల్వల నిర్మాణం లేక పోవటంతో మురుగు నీరు నిలస్తుందని సంబంధిత పంచాయితీ కార్యదర్శికి పలుమార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరువ తీసుకొని పారిశుధ్య పనులను చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమాజాన్ని చైతన్యపర్చేది నాటక రంగమే..

5వ పేజీ తరువాయి

హైదరాబాద్ వారి మూల్యం నాటిక, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా తెలుగు కళాసమితి విశాఖపట్టణం వారి నిశ్శబ్దమా నీ ఖరీదెంతా నాటికలు నిలిచాయి. ఉత్తమ ప్రేక్షక బహుమతి పాక సురేశ్, ఉత్తమ సంగీతం స్వప్నం రాల్చిన అమృతంకు సంగీతం అందించిన సాయితేజ, ఉత్తమ సహాయ నటిగా ఇంద్రప్రస్థం నాటికలో సౌందర్య పాత్రధారిణి నాగ కుసుమసాయి, ఉత్తమ సహాయ నటుడిగా కౌలస్య సుప్రజా రామా నాటికలో రామం పాత్రధారి గోపరాజు వినయ్, ఉత్తమ ప్రతినాయకుడిగా రైతే రాజు నాటికలో అబద్దం పాత్రధారి కొల్ల రాధాకృష్ణ బహుమతి అందుకున్నారు.

అలాగే ఉత్తర రంగ అలంకరణ ఇంద్రప్రస్థం నాటికకుగాను శివరామకృష్ణ, ఉత్తమ హాస్యనటుడిగా అవ్వ అప్పచ్చి నాటికలో రాంబాబు పాత్రధారి రమేశ్, ఉత్తమ క్యారెక్టర్ నటుడి బంధం నాటికలో సుబ్బారాయుడి పాత్రధారి జీవి.పురుషోత్తం, ఉత్తమ నటిగా మూల్యం నాటికలో జయంతి పాత్రధారిణి జ్యోతిరాజ్ బీశెట్టి, ఉత్తమ నటుడి నిశ్శబ్దం నీ ఖరీదెంత నాటికలో కుమార్ పాత్రధారి వరప్రసాద్‌రావు, ఉత్తమ రచనగా రైతే రాజు నాటక రచయిత కంచర్ల సూర్యప్రకాశ్, ఉత్తమ దర్శకత్వం కౌలస్య సుప్రజా రామా దర్శకుడు జి.విజయ్ అందుకున్నారు.